క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



సైదాపురం: రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

సైదాపురం: మండలంలోని చాగణం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న 15 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సుమలతకు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం సేవ చేసే తమ పట్ల ప్రతి పక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని తెలిపారు. దీంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేస్తామని తెలిపారు.

కోటలో ఆరుగురు..

కోట: మండలంలోని కర్లపూడి పంచాయతీకి చెందిన ఆరుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నా టీడీపీ, జనసేన నేతలు తమపై లేనిపోని ఆరోపణలు చేయడం బాధేసిందన్నారు. అందువల్లే తాము రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

నాయుడుపేటలో 17 మంది..



కమిషనర్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

నాయుడుపేటటౌన్: పార్టీలు, కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ, జనసేన నేతలు తరచూ విషం చిమ్ముతున్న తీరుపై శనివారం నాయుడుపేట మున్సిపాలిటీలో 17 మంది రాజీనామాలు చేశారు. పట్టణంలోని భూపయ్య కాలనీ, బీఎంఆర్ నగర్, గరిడీ వీధి సచివాలయాలకు సంబంధించి వలంటీర్లు వారి రాజీనామా పత్రాలను శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం వలంటీర్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మద్దతు తెలిపారు.

చిట్టమూరులో 15 మంది..



రాజీనామా చేసిన వలంటీర్లు

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 15 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో నాగరాజుకు అందజేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తమపై లేనిపోని ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా



శిరసనంబేడులో చింతామోహన్

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవచ్చని మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ అన్నారు. శనివారం శిరసనంబేడు గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి హస్తం గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన

రాపూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వినిగించే పరికరాలపై ఆ శాఖ అధికారి కుప్పయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, ఎవరైనా బావులు, చెరువుల్లో మునిగిపోయినప్పుడు, అటవీ ప్రాంతాల్లో తప్పిపోయినప్పుడు వినియోగించే పరికరాలను ప్రదర్శించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలు అభ్యర్థిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు





ఆశీర్వదించండి.. సేవకుడిలా పనిచేస్తా

- వెంకటగిరిని మరింత అభివృద్ధి చేస్తా
- వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి
- అట్టహాసంగా ప్రారంభమైన ప్రచారం
- జాతరను తలపించిన బంగారుపేట, సాలికాలనీ

వెంకటగిరి రూరల్/సైదాపురం: 'వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. 15 ఏళ్లుగా ఒక్క శాశ్వత అభివృద్ధి పనీ చేయలేదు. ప్రజలు నన్ను ఆదరించి ఆశీర్వదిస్తే వెంకటగిరిని అభివృద్ధి చేసి చూపిస్తాను' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరిలోని 1, 2, 3, 4వ వార్డుల్లోని బంగారుపేట, బీసీ కాలనీ, బొప్పాపురం, బొప్పాపురం సాలికాలనీ, కుమ్మరిమిట్టలో ప్రచారం చేశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణయాచేంద్ర, సీనియర్ నేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల మస్తాన్‌యాదవ్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. వారు బంగారుపేట గ్రామశక్తి పోలేరమ్మ, సీతాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ ప్రాంతం వైఎస్సార్‌సీపీ జెండాలతో కోలాహలంగా మారింది. జాతరను తలపించింది. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి హయాంలోనే వెంకటగిరి అభివృద్ధి జరిగిందని తెలిపారు. తర్వాత చెప్పుకోతగ్గ పనులు చేయలేదన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి కాసులకు కక్కుర్తిపడి అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆరోపించారు.

వెంకటగిరిలో శాశ్వత పనులు

వెంకటగిరిలో ఇప్పటికీ చెప్పుకోతగ్గ శాశ్వతమైన అభివృద్ధి పనులు నేదురుమల్లి కుటుంబం వల్లే జరిగాయని ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వారసుడు రామ్‌కుమార్‌రెడ్డి అదేబాటలో నడుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందన్నారు. కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పద్మశాలి సంఘం రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, లక్ష్మి, కౌన్సిలర్లు పేర్నేటి సుబ్బారావు, తూపాటి సుజాత, చెంచయ్య, ఎంపీ నారాయణ, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, మాడా జానకిరామయ్య, వహిదా, కందాటి కళ్యాణి, దొంతుబాల, వలికల కృష్ణయ్య, అప్పిన కాంతారావు, సుబ్బారావు, మేకల శ్రీనివాసులు, రొంటాల చిన్నా, నల్లమేకల నాగరాజు, ఆవుల గోపాల్, మల్లిరెడ్డి, కొండూరు వెంకటరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు

తాను సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను విస్తరింప చేసే దిశగా రూ.130 కోట్లతో పనులు చేపట్టినట్టు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీరు సరఫరా చేసేలా పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి నిధులు రూ.1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రచార వాహనం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నేదురుమల్లి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రచార వాహనాన్ని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజులు చాలా కీలకమైనవన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి... మీలో ఒకడిగా ఉంటా..



మేరిగ మురళీధర్‌ను సన్మానిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

- గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్
- ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నేతలతో ఆత్మీయ సమావేశం

గూడూరు రూరల్: 'ఎమ్మెల్యేగా నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. మీలో ఒకడిగా ఉంటాను. గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా' అని వైఎస్సార్ సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ కోరారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నేతలతో ఆత్మీయ సమావేశంలో మేరిగ మురళీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తన తల్లి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేశారని, ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు తనకు తెలుసన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. మనం అనుకున్నది జరగకపోయినా నమ్మకంగా ఉండాలని తన తల్లి చెప్పిన మాటకు కట్టుబడి నడుస్తున్నానని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. ఇప్పుడు సీఎం జగనన్న ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా మీముందుకు వచ్చానన్నారు. ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే సేవకుడిలా పనిచేస్తానని తెలిపారు. జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, పార్టీ మండల కన్వీనర్ మల్లు విజయకుమార్, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి, నాసిన నాగులు, సురేష్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, చంద్రమోహన్, రూపవతి, నవకోటి తదితరులు పాల్గొన్నారు.



మేరిగ మురళీధర్‌ను గజమాలతో సత్కరిస్తున్న తిక్కవరం దళితవాడకు చెందిన యువత

వైఎస్సార్‌సీపీని గెలిపించండి

చిల్లకూరు: సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ కోరారు. ఆయన శనివారం కలవకొండ, తిక్కవరం, తొణుకుమాల పంచాయతీల్లోని బెస్తపాళెం, చినకటువపల్లి, యోగీశ్వరునిపల్లి, ఉడతావారిపార్లపల్లి, చేడిమాల, నల్లాయగారిపాళెంలో ప్రచారం చేశారు. అంతకు ముందు ఆయన కలవకొండలోని లక్ష్మీనరసింహ స్వామి, తిక్కవరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆయనను తిక్కవరం దళితవాడకు చెందిన యువకులు భారీ గజమాలతో సత్కరించారు. గూడూరు ఏఎంసీ చైర్ పర్సన్ ఓడూరు యమునమ్మ, వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమార్‌స్వామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కలవకొండ సర్పంచ్ సుబాషిణి, ఓడూరు బాలక్రిష్ణారెడ్డి, రాజనేని పిచ్చయ్య నాయుడు, నాగిశెట్టి సుబ్బరాయు లు, నక్కా రాజేష్, ఉడతా శ్రీనివాసులు యాదవ్, కావలి శ్రీనివాసులు, మదన్‌కుమార్‌రెడ్డి, జయశేఖరరెడ్డి, చక్రపాణిరెడ్డి, గారా హరి, గారా వంశీ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలే అండ



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: జగనన్నకు ప్రజలే అండ అని సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆయన శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఎల్ఈడీ డిజిటల్ ప్రచార వాహనాలను ప్రారంభించారు. వాటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సహకరించిన ఎస్ఆర్ఐ ఐటీ వింగ్ హెడ్ మునిశేఖర్‌రెడ్డిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పులిని చూసి నక్క వాతపెట్టుకున్న చందంలా చంద్రబాబు వ్యవహరిస్తూ జగనన్న పథకాలను కాపీ కొడుతున్నారని కిలివేటి సంజీవయ్య అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిజిటల్ ప్రచార వాహనాలు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రంలో సీఎం జగనన్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర, బహిరంగసభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరుపై ప్రతిపక్ష పార్టీల బెంబేలు చెందుతున్నాయన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిరుపతి ఎంపీగా గురుమూర్తిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఒట్టూరు కిషోర్ యాదవ్, కట్టా భవాని శంకర్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఓజిలి జేసీఎస్ కన్వీనర్ బాషా, పోట్లపూడి రాజేష్, అత్తివరం గోపాల్‌రెడ్డి, ఎన్‌సీఆర్, రాము, రాహుల్, కె.భవాన్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని ఆదరించండి





ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న రేవంత్ చక్రవర్తి, ఓట్లు అభ్యర్థిస్తున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

గూడూరు రూరల్: సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించి పట్టం కట్టాలని ఆ పార్టీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయుడు డాక్టర్ మేరిగ రేవంత్ చక్రవర్తి కోరారు. ఆయన శనివారం గూడూరు మున్సిపాలిటీ 25వ వార్డు పరిధిలోని ఇందిరానగర్‌లో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరోసారి సీఎంగా జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గూడూరు ఎమ్మెల్యేగా తనతండ్రి మేరిగ మురళీధర్‌ను, తిరుపతి ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, నాగులు, వార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసయ్య, జనార్దన్‌రెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్లు కృష్ణప్రసాద్‌రెడ్డి, చల్లా శ్యామ్, శ్రీధర్, వెంకటేశ్వర్లురాజు, తిరుమూరు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి రాజ్యలక్ష్మి ప్రచారం

బాలాయపల్లి(సైదాపురం): వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. ఆమె శనివారం యాచవరం, రామాపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దేవికాచౌదరి, రవీంద్రారెడ్డి, ప్రసాద్‌చౌదరి, మల్లెల వెంకటేశ్వర్లు, గోపాల్ యాదవ్, రాంబాబు నాయుడు, రామతులసి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్క నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి

గూడూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గూడూరు–120(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి శనివారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన అన్నెం మల్లికార్జున్ బీఎస్పీ తరఫున నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం సెలవు కావడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బురకాల లీలామోహన్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఆర్ చంద్రమునికి అందజేశారు. శనివారం ప్రముఖ రాజకీయ పార్టీల నుంచి ఎవరూ నామినేషన్లు వేయలేదని ఎన్నికల అధికారి తెలిపారు.

వెంకటగిరిలో నామినేషన్లు నిల్

వెంకటగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని సహాయ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ సాంబశివరావు తెలిపారు. ఇప్పటి వరకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలైనట్లు వెల్లడించారు.

వసంతోత్సవాలకు అంకురార్పణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వసంతోత్సవాలకు శనివారం రాత్రి వేదపండితులు అంకురార్పణ చేశారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమాలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ స్వామి వారికి వేసవి తాపాన్ని తగ్గించేందుకు చైత్ర మాసంలో వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా నందన వనంలోని పుట్టమట్టిని తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణం, అంకురార్పణ చేపట్టినట్లు వివరించారు.

ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు, నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరింబాయి చెంచయ్య, కౌన్సిలర్లు కరింబాయి వరలక్ష్మి, దార రవి, కొండూరు రామకృష్ణంరాజు, రాయపు సరిత, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, నేతలు కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, పగడాల శివప్రదీప్, ఎం ముత్యాల రెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, కేఎంవీ కళాచంద్ర, కె.భావన్ పాలేటి నాగార్జున, కావేరిపాకం అశోక్, బేరిపేట యువత పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కుదిరి, కుదిరి తిప్పకండ్రిగ, కేసీఎస్‌గుంట, దావాదిగుంట, చెరువుకండ్రిగ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని, ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్యలను గెలిపించాలని కోరారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ, సర్పంచ్ బుంగా చెంగయ్య, జెట్టివేణు, చిలకా యుగంధర్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, వాకాటి బాబురెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

డక్కిలి: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ జి.రాజశేఖర్ కోరారు. ఆయన శనివారం తిమ్మాయిపాళెం, సూరాయిపాళెం, మోపూరు రోడ్డు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని కోరారు. ఎ.మల్లికార్జునరెడ్డి, పి.దశరథరామిరెడ్డి, బి.కృష్ణ, మల్లికార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

వెంకటగిరి రూరల్: అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలుచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని ఆ పార్టీ రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆయన శనివారం చెలికంపాడు, కుర్జాగుంట పంచాయతీల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ అభ్యర్థులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణమ్మ, నేతలు కడప రమణయ్య, సుబ్బారావు, బాబు, కోటి, హరి, తిరుపాల్‌రెడ్డి, సదానందరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన

కోట: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ప్రజలు సహకరించాలని ఎంపీడీవో శంకరయ్య కోరారు. ఆయన శనివారం రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి ఊనుగుంటపాళెం, చంద్రశేఖరపురం గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

ఆంగ్లభాషా దినోత్సవం

రాపూరు: కండలేరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ప్రపంచ ఆంగ్లభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆంగ్ల భాష ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఆంగ్ల భాష కీలకం కానుందన్నారు. అంతకుముందు విద్యార్థులకు ఆంగ్ల భాషపై క్విజ్, పాటలు తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- కిలివేటి గెలుపుకోసం కుమార్తె ప్రచారం



ప్రచారం చేస్తున్న కిలివేటి సౌజన్య

సూళ్లూరుపేట: జగనన్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని కిలివేటి సంజీవయ్య కుమార్తె సౌజన్య అన్నారు. ఆమె శనివారం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పోలూరు పద్మ మిల్టన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని 4, 5 వార్డుల్లో ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి కిలివేటి సంజీవయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. కౌన్సిలర్లు పముజుల విజయలక్ష్మి, పొన్నా మునిప్రసాద్, బోడేలు శరత్‌చంద్ర గౌడ్, మాజీ కౌన్సిలర్లు పాలమురళి, ముంగర అమరావతి, కన్నంబాక మునస్వామి పాల్గొన్నారు.

దుప్పిని కాపాడిన గ్రామస్తులు

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలోకి శనివారం దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చిన దుప్పిపై కుక్కలు దాడికి దిగాయి. దాన్ని గ్రామస్తులు కాపాడారు. గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి ఒక చుక్కల దుప్పి కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు వచ్చింది. దానిపై కుక్కలు దాడికి దిగాయి. గ్రామస్తులు దాన్ని కాపాడి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అంకులపాటూరు పశువైద్యుడు సిరాజ్‌తో చికిత్స చేయించి అటవీ ప్రాంతంలో వదలి పెట్టారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ





వెంకటగిరి: నేదురుమల్లి సమక్షంలో పార్టీలో చేరిన నేతలు, నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి నేతలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

సైదాపురం/వెంకటగిరి రూరల్/ బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కార్తీక్‌రెడ్డి, నేత కాసరం నీలకంఘం ఆధ్వర్యంలో గాజులపల్లికి చెందిన మారెళ్ల దశరథ, వేగూరి సాయిరాంతో పాటు పట్టణంలోని 17వ వార్డుకు చెందిన నారాయణ పార్టీలో చేరారు. వారికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గటోలు గురవయ్య, దాసరి సుబ్బరాయులు, తులసీరామ్, టైలర్ శ్రీను పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిలోని 4వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ గుర్రం మణితోపాటు మరో 50 కుటుంబాల వారు వార్డు కౌన్సిలర్ ఎం.నారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్‌కుమార్‌రెడ్డి రాజా కుటుంబికులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర, కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్, చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బాలాయపల్లి మండలంలో..

బాలాయపల్లి మండలంలోని పచ్చారుచేను, కడగుంట గ్రామాలకు చెందిన సుమారు 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రాయి దేవికచౌదరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఇందులో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన గోళ్లపుల్లయ్య, వయ్యావూరు కోటేశ్వరరావు, తాళ్లూరు మణినాయుడు, పసుపులేటి శ్రీనివాసులు, మనోహర్, శైలజ, చంద్రగిరి శీనయ్య, శివశంకర్‌తోపాటు పలువురికి మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సైదాపురం: పార్టీలో చేరిన నేతలు